క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి బడేటి నవనీత్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల హన్మకొండలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్–17 అథ్లెటిక్ 800 మీటర్ల పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హెచ్ఎం బండి నర్సింహరావు, పీడీ రవికుమార్, ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, శంకర్, శ్రీనివాస్, మంజులత, కమల, వసంతరాణి అభినందించారు.

రూ.30వేల ఆర్థికసాయం



మరిపెడ రూరల్: మండలంలోని తాళ్లఊకల్ గ్రామానికి చెందిన పుల్లూరి దేవయ్య కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో 1987–86 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు రూ.30వేల ఆర్థికసాయం మిత్రుడు దేవయ్యకు అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు మధు, అంబరీష, కర్ణాకర్‌రెడ్డి, కృష్ణ, శ్రీను, శ్రీనివాస్, మహమ్మద్ బషీద్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నెల్లికుదురు: కొనుగోలు కేంద్రాలల్లో వరి ధాన్యాన్ని విక్రయించి సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం అందించే రూ.500బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలని శ్రీరామగిరి సొసైటీ చైర్మన్ గుండ వెంకన్న రైతులను కోరారు. మండలంలోని రాజులకొత్తపల్లి, ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామాలల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈఓ వెంకన్న, ఏఈఓ ముజాహిద్ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ కమిటీ ఎన్నిక



లింగానాయక్, అధ్యక్షుడు

మరిపెడ రూరల్: మరిపెడ టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీని మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి నందిగామ జనార్ధనాచారి మంగళవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా గుగులోతు లింగానాయక్, ప్రధాన కార్యదర్శిగా చెరుకుపల్లి ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా నెహ్రూ, కల్యాణి, కోశాధికారిగా యాకయ్య, కార్యదర్శులుగా మారెడ్డి, దేవులా, మురళీకృష్ణ, ఐలయ్య, ఉప్పలమ్మ, చంద్రశేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్యాంబాబు, అకాడమిక్ కమిటీ కన్వీనర్లుగా లాల్‌చంద్, నిర్మల, గురుకులాల కన్వీనర్లుగా సుభాషిని, భారతి, కేజీబీవీ కన్వీనర్ జ్యోతి, మోడల్ స్కూల్‌కు నాగర్జున, కల్చరల్ కన్వీనర్‌గా నరేష్, జిల్లా కన్వీనర్లుగా నందిగామ జనార్ధనాచారి, గోవర్దన్, మంగు, ఎఫ్‌డబ్ల్యూ కన్వీనర్ రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

తైక్వాండోలో విద్యార్థిని ప్రతిభ



నర్సింహులపేట: ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 విభాగంలో సంగారెడ్డి జిల్లాలో జరిగిన తైక్వాండో స్టేట్ లేవల్ క్రీడల్లో నర్సింహులపేట మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని కైత కేజీయా బ్రాంజ్ మెడల్ అందుకుంది. ప్రిన్స్‌పాల్ నర్సిరెడ్డి, పీడీ శ్రీను, ఉపాధ్యాయులు అభినందించారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్లను మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం మంగళవారం తనిఖీలు చేపట్టాడు. ఈసందర్భంగా పలు స్కానింగ్ సెంటర్లను పరిశీలించి, లింగనిర్ధారణ పరీక్షలు నేరమని, అలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కె.ప్రసాద్, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రం

మహబూబాబాద్ అర్బన్: వరి కోతలు ప్రారంభమై నెలరోజులు కావస్తున్నప్పటికీ మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లిలో మెప్మా ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పొలాల్లో రైతులు ధాన్యం కుప్పలు పోసి రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు. తక్షణమే జమాండ్లపల్లిలో కొనుగోళ్లను ప్రారంభించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

నిప్పు.. భూసారానికి ముప్పు

- వరికొయ్యలు కాల్చితే దిగుబడిపై ప్రభావం
- అలాగే దున్నితే పోషకాల వృద్ధి
- వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తే మేలు



బావోజీతండాలో వరికొయ్యలకు నిప్పు పెడుతున్న రైతు

పెద్దవంగర: వరి కోతలు పూర్తవుతున్నాయి. వ్యవసాయంలో ప్రస్తుతం కూలీల కొరత ఉండడంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. వరికోతలకు హార్వేస్టర్లను వినియోగిస్తుండడంతో గడ్డి వినియోగం తగ్గిపోయింది. పశు సంపద ఉన్నవారు మిగతావారు అలాగే పొలంలో వదిలేస్తున్నారు. తదుపరి పంటకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరికొయ్యలతోపాటు గడ్డిని సైతం దహనం చేస్తున్నారు. అన్నదాతలు అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యలతో భూసారానికి ముప్పు పొంచి ఉందని, పంటల ఎదుగుదలకు తోడ్పడే సూక్ష్మపోషకాలకు హాని కలుగుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పెద్దవంగర మండలంలో ఈ ఖరీఫ్‌లో రైతులు 13,023 ఎకరాలు వరిసాగు చేశారు. ఖరీఫ్‌లో వరిపంట చేతికి రాగా యాసంగి పంటకు తమ భూములను సిద్ధం చేసుకుంటున్నారు. పొలాల్లో మిగిలిపోతున్న గడ్డికి పంట కొయ్యలకు నిప్పు పెడుతున్నారు.

కొయ్యలు కాలిస్తే జరిగే నష్టాలు..

వరి కొయ్యలు కాలిస్తే భూమిలో పోషకాలు తగ్గి దిగుబడి పడిపోతుంది. పంటల మేలు చేసే పోషకాలు దెబ్బతిని, నైట్రోజన్, పాస్పరస్, పోటాషియం ఆవిరై భవిష్యత్‌లో పంటల ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం పడుతోంది. మట్టిలో సూక్ష్మజీవులు దెబ్బతిని మట్టి జీవచక్రం అస్తవ్యస్తంగా మారుతుంది. మట్టి నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. తద్వారా భవిష్యత్ పంటలకు నష్టం జరుగుతుంది.

అవగాహన లేక పోవడం వల్లే..

పశుసంపద రోజురోజుకు తగ్గిపోవడంతో పశుగ్రాస అవసరం తగ్గుతుంది. ఫలితంగా వరి పొలాలను కోసే సమయంలో రైతులు కంకి వరకే కోయించేందుకు ఆసక్తిని చూపుతున్నారు. మిగత గడ్డి పొలంలో కొయ్యకాళ్ల రూపంలో మిగిలి పోతోంది. దీన్ని మళ్లీ వరిసాగు చేసే సమయంలో కాల్చితే ప్రయోజనం చేకూరుతుందని రైతులు భావిస్తున్నారు. కొయ్యకాళ్లకు నిప్పు పెడితే జరిగే నష్టాలపై వారికి అవగాహన లేకపోవడంతో ఇలా చేస్తున్నారు.

భూమిలోనే కలియ దున్నాలి



వరి పొలాల్లోని కొయ్యకాళ్లకు నిప్పు పెడితే భూసారం కోల్పోతుంది. అలాగే ఉంచి దున్నితే సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయి. భూమిలో మెగ్నిషియం, కాలుష్యం, సూక్ష్మజీవులు ఉండి పంటలకు మేలు చేస్తాం. నత్రజని పెరిగి మిత్ర పురుగులు చనిపోవు.

– స్వామి నాయక్, ఏఓ

పంట భూమికి నష్టం

గార్ల: వరికోతల అనంతరం వరికొయ్యలను కాల్చడం వలన పంట భూమికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. మంగళవారం గార్ల సమీపంలోని వరిపంటలో క్షేత్ర ప్రదర్శన చేశారు. ఏఓ వెంట ఏఈఓ కిరణ్ పాల్గొన్నారు.

నర్సింహులపేట: వరి కొయ్యలను కాల్చడం మానేసి, భూసారాన్ని పరిరక్షించాలని ఏఓ వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వంతడపల గ్రామంలో మంగళవారం వరి కొయ్యలు కాల్చితే జరిగే నష్టాలపై రైతులకు వివరించారు.

హామీలను అమలు చేయాలి



సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగ పింఛన్ రూ.4వేల నుంచి రూ.6వేల వరకు పెంచుతామని హామీ ఇచ్చి నేటికి అమలు చేయలేదని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఎమ్మెల్సీ రవీందర్‌రావుతోపాటు బీఆర్ఎస్ నాయకులు దీక్షకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ పాషా, నాయకులు ప్రవీణ్, వినోద్ రెడ్డి, వెంకన్న, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న పాల్గొన్నారు.

ఆర్టీసీ గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

నెహ్రూసెంటర్: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి తక్షణమే గుర్తింపు సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న అన్నారు. ఆర్టీసీ బస్టాండ్ డీపో ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 ఏడాది నుంచి కార్మిక సంఘాలపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆంక్షలు పెట్టి గుర్తింపు సంఘాల ఎన్నికలను రద్దు చేసిందని తెలిపారు. ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చందు, శ్రవణ్, సుధాకర్, ఎండి. రజాక్, ఎర్ర శ్రీను, శ్రీశైలం, ఐలయ్య, బాబు, రమేశ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



నెల్లికుదురు: జెండాఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



మానుకోట నుంచి..



కురవి నుంచి..



మరిపెడ: మండలం నుంచి వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

హన్మకొండలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన విజయోత్సవ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం వాహనాల్లో పెద్దఎత్తున తరలివెళ్లారు. నాయకులు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

జడ్జిపై చర్య తీసుకోవాలి



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

తొర్రూరు: న్యాయవాదులపై దురుసుగా వ్యవహరిస్తున్న తొర్రూరు జడ్జిపై చర్య తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్వకొలను ప్రవీణ్‌రాజు, ప్రధాన కార్యదర్శి ఘణపురం రామకృష్ణ డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన తెలిపారు. జడ్జి తీరుపై హైకోర్టు పోర్ట్ పోలియో జడ్జి నందా, జిల్లా జడ్జి రవీంద్రశర్మలకు వినతిపత్రాలు అందించామన్నారు. నిరసనలో బార్ ఉపాధ్యక్షుడు శ్రీశైలం, న్యాయవాదులు వెంకన్న, యాకాంబ్రం, మధుసూదన్, ప్రేమ్‌చందర్, ముకుందారావు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై పాలకుల వివక్ష



మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

నెహ్రూసెంటర్: జిల్లా అభివృద్ధిపై పాలకులు వివక్ష, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో జిల్లాను ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. విభజన హామీలైన బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకుండా దాట వేసే దోరణితో పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాట చేసి ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని 550 పడకలగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. సంక్షేమం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, ఆకుల రాజు, కుంట ఉపేందర్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు చేయూత ఇవ్వాలి

తొర్రూరు: సేవా కార్యక్రమాలకు చేయూతనివ్వాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్‌కుమార్ అన్నారు. క్లబ్ కోశాధికారి భోనగిరి శంకర్, జ్యోతి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. గోశాలలో గోవులకు రూ.5వేల విలువ చేసే పశుగ్రాసాన్ని వితరణ చేశారు. హరిహర క్షేత్రంలో అయ్యప్ప మాలధారులకు అన్నదాన వితరణ, కుమ్మరికుంట్ల పాఠశాలకు పోడియంను బహూకరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు దామెర సరేష్, రమేశ్, కుమారస్వామి, వజినపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.53వేల వెటర్నరీ డ్రగ్స్ సీజ్



పట్టుకున్న వెటర్నరీ డ్రగ్స్ పెట్టెలు

మరిపెడ రూరల్: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.53వేల విలువ గల పశువుల మందులు (వెటర్నరీ డ్రగ్స్) సీజ్ చేశారు. ఈసంఘటన మండలంలోని తానంచర్ల గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. విశ్రాంత ఉద్యోగి అయిన కోటయ్య వరంగల్ నుంచి వారానికి రెండు, మూడుసార్లు వచ్చి మండలంలోని తానంచర్ల, తాళ్లఊకల్, గిరిజన తండాల్లో పశువులకు వైద్యం చేస్తున్నాడు. ఈక్రమంలో కోటయ్య వెటర్నరీ డ్రగ్స్ పెద్ద మొత్తంలో తెచ్చి తానంచర్ల గ్రామంలోని రాంరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచాడు. సమాచారం మేరకు సదరు వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేయగా పశువులకు చెందిన సుమారు రూ.53వేల విలువ చేసే వెటర్నరీ డ్రగ్స్ లభించింది. సీజ్ చేసినట్లు జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఉమారాణి తెలిపారు. అతడిపై శాఖ పరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

నెల్లికుదురు: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశాడు. ఈమేరకు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం మండలంలోని ఆలేరు, వావిలాల, శ్రీరామగిరి గ్రామాలల్లో కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ముంజంపల్లి వీరన్న, వెంకన్న, వీరేశం, వెంకట్రాంనర్సయ్య, రమేశ్, వెంకన్న, మహేందర్, కృష్ణ, నరసమ్మ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం నిర్మితమై మంగళవారం నాటికి 14సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కమిటీ సభ్యులు వార్షికోత్సవ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవతో ఆలయ పూజారి ఆశీష్‌పాండ్యే పూజలు ప్రారంభించారు. అనంతరం భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి సాయిబాబా విగ్రహానికి పాలాభిషేకం, అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం దేవాలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెన్నబోయిన ఉప్పలయ్య, దోని యాదగిరి, బాబూరావు, దొడ్డ శ్రీనివాస్, శివాలయ పూజారి సతీష్‌పాండ్యే ఏర్పాట్లు నిర్వహించారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



మహబూబాబాద్ రూరల్: ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



మరిపెడ: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



గార్ల: నివాళులర్పిస్తున్న నాయకులు



గంగారం: నివాళులర్పిస్తున్న నాయకులు

దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పలుచోట్ల కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



తొర్రూరు: ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

సంక్షిప్త సమాచారం

అంతర కృషితో చీడపీడల నివారణ

మహబూబాబాద్ రూరల్: మామిడి, సపోట తోటల్లో అంతర కృషి చేయడం ద్వారా చీడపీడలను సమర్ధవంతంగా అరికట్టవచ్చని జేవీఆర్ హెచ్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త నాగరాజు సూచించారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో మల్యాల శ్రీనివాసరావు మామిడి, సపోట తోటలను మంగళవారం ఆయన సందర్శించారు.

విద్యుత్ మీటర్లు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: పట్టణంలో గల ఇంటింటికి విద్యుత్ మీటర్లను ఇవ్వాలని సీపీఎం టూటౌన్ కార్యదర్శి అల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ డీఈ విజయ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమ్మెట రాజమౌళి, హేమానాయక్, నక్క సైదులు, ఎర్ర శ్రీనివాస్, బానోత్ వెంకన్న పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

బయ్యారం: డిసెంబర్ 1న కురవిలో నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ మంగళవారం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమణమ్మ, భద్రు నాయక్, వెంకన్న, బాలునాయక్, ప్రసాద్, వెంకన్న, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

గార్ల: వైద్య ఆరోగ్యశాఖ డిపార్ట్‌మెంట్ వెరిఫికేషన్ ఆలస్యం కారణంగా రెగ్యులర్ కాకుండా అన్యాయానికి గురైన 60 మంది ఆదివాసీ గిరిజన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ మంగళవారం గార్లలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు గిరిజన లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్ వినతిపత్రం అందజేశారు.

జిల్లా కమిటీలో చోటు



గార్ల: సీపీఎం జిల్లా కమిటీలోకి గార్ల మండలం నుంచి నలుగురికి చోటు లభించింది. డోర్నకల్ మండలంలో ఇటీవల జరిగిన సీపీఎం పార్టీ జిల్లా 3వ మహాసభలో మండలానికి చెందిన కందునూరి శ్రీనివాసరావు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా, కందునూరి కవిత, అలువాల సత్యవతి, హరినాయక్‌లను జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

విజయవంతం చేయాలి

నెల్లికుదురు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 21న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే మండలస్థాయి చెకుముకి పోటీలను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు దేశెట్టి యాకన్న మంగళవారం తెలిపాడు.

డోర్నకల్‌లో అదృశ్యం.. హైదరాబాద్‌లో గుర్తింపు



సైకిల్‌పై విద్యార్థులను వెతుకుతున్న సీఐ

డోర్నకల్: డోర్నకల్‌లో సోమవారం అదృశ్యమైన ఇద్దరి బాలుర ఆచూకీ మంగళవారం హైదరాబాద్‌లో లభ్యమైంది. సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శాంతినగర్‌కు చెందిన మంద వంశీ(15), ఎంపీపీఎస్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న అంబేద్కర్‌నగర్‌కు చెందిన మారపల్లి సంజయ్(11) సోమవారం స్కూల్‌కు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పిల్లల ఆచూకీ కోసం వెతికి మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ బి.రాజేష్ ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. సీఐ సైకిల్ తొక్కుతూ మున్నేరు వాగుతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యార్థుల కోసం వెతికారు. వంశీ, సంజయ్ సికింద్రాబాద్, ఉప్పల్ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందింది. డోర్నకల్‌కు రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు. పిల్లలు హైదరాబాద్‌కు ఎందుకు వెళ్లారనే అంశంపై విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

నేత్ర వైద్యశిబిరం

మహబూబాబాద్ అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ షెఫర్డ్, శ్రీసత్య లయన్స్ చారిటబుల్ కంటి హాస్పిటల్ చైర్మన్ లయన్ రొయ్యరు సురేష్, మేనేజింగ్ డైరెక్టర్, సెక్రటరీ లయన్ ధరావత్ రెడ్డి నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గండి ఉపేందర్ రావు, వైస్ ప్రిన్సిపాల్ రాధా, ఉపాధ్యాయులు సునీల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గర్భకోష వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈశిబిరంలో దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పశువైద్యాధికారి బి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడదూడలు పుట్టే లింగ నిర్ధారణ చేసే పద్ధతి అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి టి.రాజేందర్, డీఆర్‌పీ నాగేశ్వర్ రావు, సరోజ, సంధ్య పాల్గొన్నారు.

ఆదర్శ రైతుల డివిజన్ కమిటీ ఎన్నిక



మహబూబాబాద్ రూరల్: ఆదర్శ రైతుల డివిజన్ కమిటీ ఎన్నిక జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆదర్శ రైతుల సంఘం సూచన మేరకు డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల ఆదర్శ రైతులు పాల్గొని సంఘం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏనుగ వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రూపిరెడ్డి కళావతి, ప్రధాన కార్యదర్శిగా నాయిని ఇంద్రారెడ్డి, సహాయ కార్యదర్శిగా పడకంటి వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా లింగాల నాగేశ్వర్ రావు, బొల్లం ఐలయ్య, మండల శ్రీనివాస్, బోయిని భద్రయ్య, బొమ్మరాజు కుమారస్వామి, మలిశెట్టి భాగ్యమ్మ, కోశాధికారిగా వాంకుడోత్ సర్వన్ ఎన్నికయ్యారు.